
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
శుక్రవారం 31-7-2026 www.prajajyothinews.com పేజీలు : 8



**చౌటుప్పల్, జులై 30 (ప్రజా జ్యోతి):**

చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూముల బాగోతం ఒక్కొక్కటిగా వెలుగు చూస్తోంది. వారం క్రితం ఈ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ వెంచర్ల దందాపై 'ప్రజా జ్యోతి'లో కథనం ప్రచురితమై తీవ్ర కలకలం రేపినప్పటికీ, కబ్జాదారుల తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. అధికారుల పర్యవేక్షణా లోపాన్ని, రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని సర్వే నెంబర్లు 524, 525 పరిధిలోని కోట్లాది రూపాయల విలువైన వక్ఫ్ భూములను అక్రమార్కులు తమ అడుగుల్లోకి తెచ్చుకుంటున్నారు. కొందరు కేటుగాళ్లు ముఠాగా ఏర్పడి, ఎలాంటి హక్కులు లేకపోయినా ప్రభుత్వ, వక్ఫ్ స్థలాలను తమ సొంత ఆస్తిలా భావిస్తూ యథేచ్ఛగా అక్రమ దందాను సాగిస్తున్నారు.- రోడ్డు లేదు.. ప్లానింగ్ అంతకంటే లేదుఃక్షేత్రస్థాయిలో చూస్తే అక్కడ కనీసం రాకపోకలకు సరిపడే రోడ్డు సౌకర్యం గానీ, నిబంధనల ప్రకారం ఎలాంటి అధికారిక లేఅవుట్ ప్లానింగ్ గానీ లేదు. కనీసం డ్రైనేజీ, విద్యుత్ లైన్లు వంటి ప్రాథమిక వసతులు కూడా కల్పించలేదు. అయినా సరే, రియల్ మాఫియా రంగంలోకి దిగి అమాయకులను బురిడీ కొట్టించేందుకు నకిలీ ప్లానింగ్ డయాగ్రామ్‌లను అస్త్రంగా మలుచుకుంది. కేవలం కాగితాలపై రంగుల ప్లాన్లు, నకిలీ బ్రోషర్లు చూపుతూ అమ్మకాలపర్వాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.







# వక్ఫ్ భూమిలో అక్రమ సామ్రాజ్యం

4 లో..



- అధికారులను సైతం లెక్కచేయని భూమాఫియా
- రోడ్డు లేదు.. ప్లానింగ్ లేదు.. పాంప్లెట్లు చూపుతూ బురిడీ
- గుట్టుచప్పుడు కాకుండా ప్లాట్ల విక్రయం

## లిఫ్టుల రక్షణ రైతుల బాధ్యత
## దొంగతనాలకు చెక్ పెట్టేందుకు
# సమష్టిగా కృషి చేయాలి

-రైతు కమిటీలతో నిరంతర పర్యవేక్షణ- లిఫ్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
-లిఫ్టులను సొంత ఆస్తిగా కాపాడుకోవాలి- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

5 లో..





6 లో..

## ఆరుతడి పంటలు సాగుచేస్తే
# రైతులకు మేలు విజ్ఞప్తి

-నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ క్రీడా దుస్తుల పంపిణీ

**రూ.10 వేల విలువైన స్పోర్ట్స్ కిట్ అందించిన గ్రామ పెద్ద గుమడవెల్లి శ్రీనివాస్-దాత సేవలను అభినందించిన ప్రధానోపాధ్యాయులు యర్ర హరికిషన్-క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచన**



**నాగారం జూలై 30 ప్రజా జ్యోతిః** నాగారం మండల పరిధిలోని పసునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు యర్ర హరికిషన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కమటం సునీతా శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి నజీర్, గ్రామ పెద్ద గుమడవెల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద, దాత గుమడవెల్లి శ్రీనివాస్ సుమారు పదివేల రూపాయల విలువైన కబడ్డీ క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. దాత సేవలను ప్రధానోపాధ్యాయులు యర్ర హరికిషన్ అభినందిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి అందిస్తున్న సహకారం ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, శివకుమార్, విజయలక్ష్మి, శోభారాణి, వెంకన్న, రాములు, హెచ్.బీ. చారి, వీరయ్య, పద్మతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం, యూనిఫాంల పంపిణీ వేగవంతం చేయాలి

**- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**భూదాన్ పోచంపల్లి, జూలై 30 (ప్రజాజ్యోతి):** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ)తో పాటు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న విద్యార్థుల యూనిఫాంల కుట్టు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు, అటెండెన్స్ రిజిస్టర్, ఆహార నాణ్యత, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం రుచి, నాణ్యత, మెనూ అమలుపై వివరాలు తెలుసుకున్న ఆయన, మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే యూనిఫాంల కుట్టు పనులను మరింత మంది టైలర్లతో వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోగా విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోచంపల్లిలో బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్సై జె. జగన్




**భూదాన్ పోచంపల్లి, జూలై 30(ప్రజాజ్యోతి):** భూదాన్ పోచంపల్లి పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా జె. జగన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సైబర్ క్రైమ్ విభాగం నుంచి బదిలీపై వచ్చిన ఆయన, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన భాస్కర్ రెడ్డి జిల్లా వీఆర్‌కు బదిలీ అయ్యారు. అనంతరం పోలీసు సిబ్బంది, పలువురు నాయకులు నూతన ఎస్సైకి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ' పాటతో ఒక పూట ' పోగ్రాం పోస్టర్ల ఆవిష్కరణ

**ఆగస్టు 14న, బిసి భవన్ లో సామాజిక చైతన్య, దేశభక్తి సాంస్కృతిక వేడుకలు**



**మిర్యాలగూడ, జులై 30,( ప్రజాజ్యోతి ):** కళలను, కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ' పాటతో ఒక పూట ' పేరుతో సామాజిక చైతన్య, దేశభక్తి గీతాలు, సంగీతం, సాహిత్యం, నృత్య రూపకాలతో కూడిన వైభవోపేత సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆగస్టు 14న,నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ జాడి రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం మిర్యాలగూడలోని షెడ్యూల్డ్ కులముల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సమాజం లో దాగి ఉన్న ప్రతిభావంతులైన కళాకారులనువెలికితీసి, వారికి తగిన గుర్తింపు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమనిపేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే పోటీల్లో దేశభక్తి గీతాలు, సామాజిక చైతన్య గీతాలు, సంగీత ప్రదర్శనలు, నృత్యరూపకాలుమరియుఇతరసాంస్కృతికకళారూపాలుప్రదర్శించేందుకుఅవకాశంకల్పిస్తున్నామనితెలిపారు. జిల్లా నలుమూలల నుంచి గాయకులు,కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. పోటీల్లో ప్రతిభ కనబరిచినకళాకారులను గుర్తించి ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలుఅందజేయనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 14న మిర్యాలగూడలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవన్ వేదికగా జరిగే ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ , ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు,ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడుగుల శ్రీనివాస్, తెలంగాణ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ కుమార్, జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మునీర్, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు దశరథ్ నాయక్, బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి దుర్గయ్య, సామాజికవేత్త మహమ్మద్, బీసీ జేఏసీ కో-కన్వీనర్ దాసరాజు జయరాజు,సోమ ఆంజనేయులు,కాకునూరి రవి, జగదీశ్వర్ రెడ్డి, వట్టికోట శ్రీను వెన్నెల, నక్క నాగరాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలతో ప్రజాదరణ పొందాలి

**- మిర్యాలగూడలో నూతన లీలా హాస్పిటల్స్ ప్రారంభోత్సవం**

**-పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు**







**మిర్యాలగూడ,జులై 30, ( ప్రజాజ్యోతి ):** మెరుగైన వైద్య సేవలు, చౌకగా అందించి ప్రజాదరణ పొందాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ లు కేతావత్ శంకర్ నాయక్, ఎం.సీ.కోటిరెడ్డి లు కోరారు .గురువారంమిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నూతనంగా డాక్టర్ ఎల్.ఎన్.వి. రాజేష్ రెడ్డి, బొబ్బలి వెంకట్రాంరెడ్డి(టామ్ రెడ్డి) ,మందడి సైదిరెడ్డి, జూకూరి చైతన్య రాజు, డాక్టర్. కె.సుధాకర్, ధనావత్ రంగ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లీలా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధునాతన వైద్య పరికరాలు, నైపుణ్యం కలిగిన వైద్యుల పర్యవేక్షణలో మిర్యాలగూడ పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించి ప్రజల అభిమానం, ఆదరణ పొందాలన్నారు. లాభాపేక్షతోనే కాకుండా, సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నరసింహరెడ్డి,నల్గొండ డిసిసి అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత, వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య,డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, జిల్లా నాయకులు గుడిపాటి నవీన్, గాయం ఉపేందర్ రెడ్డి, 47 వార్డు కౌన్సిలర్ ఫారూఖ్ మొహమ్మద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, మోయిజ్, వ్యవసాయమార్కెట్ ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి,జిల్లా నాయకులు మేడ మహేందర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, తదితరులున్నారు. బి ఆర్ ఎస్ నాయకులు :- కంటెస్టెడ్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

**- ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**



**హాలియా,జూలై30(ప్రజా జ్యోతి):** ప్రజాస్వామ్యంలో పౌరుల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రతి అర్హుడికి ఓటు హక్కుకల్పించడమే తమ నైతిక బాధ్యతని ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు.గురువారం హాలియా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతతో కలసి ప్రత్యేక సంక్షిప్త సర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో 306 బూతులలో ఓటర్ల నమోదు ప్రక్రియను వేగంగా పారదర్శకంగా పూర్తి చేసి రాష్ట్రంలోనే నాగార్జున్ సాగర్ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి కార్యచరణను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న బూతులు ఏజెంట్లు బిఎల్ఎ,బి ఎల్ ఓ ల అంకిత భావాన్ని కొనియాడారు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా ఓటు నమోదు చేసుకోకుండా మిగిలిపోయిన వారిని గుర్తించి తక్షణమే జాబితాలో చేర్చాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనుముల మండల పార్టీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ యాదవ్, నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం,మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్,మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్,లాలు నాయక్, డిసిసి కార్యదర్శి పోదిల కృష్ణ కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్ల సలహాదారులు నకిరేకంటి సైదులు,మజాహర్ మొహినుద్దీన్,చిట్టిప్రోలు కరుణాసాగర్,పిల్లి ఆంజనేయులు,కర్రెద్దుల నరసింహ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే ప్రాధాన్యం

**- సీసీ కెమెరాలు ప్రారంభించిన సిఐ రాఘవరావు**



**హాలియా,జూలై30(ప్రజా జ్యోతి):** గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల ప్రాణ నష్ట నివారణే ధ్యేయంగా గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు హాలియా సిఐ రాఘవరావు,ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.గురువారం మండల పరిధిలోని శ్రీనాథపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 6 సీసీ కెమెరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేరాల రహిత వాతావరణాన్ని సృష్టించడంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో దోహదపడుతుందన్నారు. ముందస్తు నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక శక్తుల కదలికలను నిరంతరం పసిగట్టేందుకు,నేరస్థులను సత్వరమే గుర్తించేందుకు సీసీ కెమెరాలు మూడో కన్నులా పనిచేస్తాయని పేర్కొన్నారు. నిరంతరం నిఘా నీడలో గ్రామం సురక్షితంగా ఉంటుందని, ప్రజలు కూడా స్వీయ రక్షణతో పాటు పోలీసులకు సహకరించి ఈ కెమెరాల నిర్వహణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో శ్రీనాథపురం సర్పంచ్ శ్రీమతి మల్‌రెడ్డి సీతమ్మ--వెంగల్‌రెడ్డి, గ్రామ ప్రముఖులు మల్‌రెడ్డి భాను చందర్ రెడ్డి,కాలం శేఖర్ రెడ్డి,కాలం కృష్ణ రెడ్డి,ఎన్ఆర్ఐ గోపాల్ రెడ్డి,గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన పట్టు వస్త్రాలంకరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**మోతె జూలై 30 (ప్రజాజ్యోతి ):** మోతె మండల కేంద్ర వాస్తవ్యులు జిల్లపల్లి సోమయ్య, చంద్రకళ కుమార్తె త్రిషిత యొక్క నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వారి వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు యాదవ్, జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వర రావు, మాజీ ఎంపీపీ లింగారెడ్డి, మండల నాయకులు మిక్కిలినేని సతీష్ బాబు, దేవుల నాయక్, మద్ది మధుసూదన్ రెడ్డి, జానీ పాషా, శ్రీనివాస్ రెడ్డి,తరుణ్,నవీన్,తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

**నేరేడువాయి గ్రామ సర్పంచ్ దారమళ్ళ గోవర్ధన్**

**మోతె జూలై 30( ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని నేరడవాయి గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ దారమళ్ళ గోవర్ధన్ వీబీజీ-రామ్‌జీగా పథకంలో భాగంగా రహదారి పక్కన మొక్కలు నాటినారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. నేటి దినాల్లో జరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలకు గల కారణం చెట్లను నరకడమేనని చెట్లను నరకడం ద్వారా పర్యావరణానికి ఎంతో నష్టం కలుగుతుందని తద్వారా భావితరాలు అనేక నష్టాలు చవిచూడవలసి వస్తుంది కాబట్టి ప్రపంచం పర్యావరణం భావితరాల భవిష్యత్తు మంచిగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు.



## గుడిమల్కాపురం గ్రామసభ వాయిదా

**- కొత్త పంచాయతీ భవనంపై వివాదం**

**- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్న గ్రామసభ నిర్వహించడం లేదన్న పాలకవర్గం**



**చింతలపాలెం, జూలై 30 (ప్రజా జ్యోతి):** చింతలపాలెం మండలం గుడిమల్కాపురం గ్రామంలో కొత్త గ్రామపంచాయతీ భవనం వినియోగంపై కొనసాగుతున్న వివాదం గురువారం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా నిర్వహించాల్సిన గ్రామసభ, కొత్త భవనంలో నిర్వహించాలా లేక పాత గ్రామపంచాయతీ భవనంలో నిర్వహించాలా అనే అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా పడింది. గ్రామసభను కొత్త గ్రామపంచాయతీ భవనంలోనే నిర్వహించాలని సర్పంచ్ పోల్నేడి నరసమ్మ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పట్టుబట్టారు. కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయానికి సంబంధించిన రోజువారీ కార్యకలాపాల్లో అధికారులు జోక్యం చేసుకోవద్దని తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, కొత్త భవనంలోనే గ్రామసభ నిర్వహించాలని వారు కోరారు. అయితే తమకు పంచాయతీ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సమాచారం లేనందున్న గ్రామ సభ ఎక్కడ నిర్వహించాలో స్పష్టత లేక గ్రామసభ నిర్వహించడం సాధ్యం కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు తహశీల్దార్ రామకృష్ణారెడ్డి తెలిపారు. మరోవైపు, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ అధికారులు వాటి ప్రకారం వ్యవహరించలేదని సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే గ్రామసభ నిర్వహణకు ఆటంకం కలిగించారని విమర్శించారు. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి అనిత కుమారి కొత్త గ్రామపంచాయతీ భవనంలో కార్యక్రమం నిర్వహించేందుకు తాము నిరాకరించలేదని, ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే వ్యవహరించామని, నూతన గ్రామపంచాయతీ భవనం అధికారికంగా ప్రారంభించేందుకు ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ఘన సన్మానం


**పోలీసు ఉద్యోగం ప్రజాసేవకు అంకితమైన బాధ్యత..జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**




**నల్గొండ జూలై 30,(ప్రజా జ్యోతి ):** నల్గొండ జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం నిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందిన ఎఎస్ఐ ఎన్. ప్రభాకర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి. మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. హిదాయత్ అలీలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలతో వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం ప్రజల భద్రతకు అంకితమైన గొప్ప బాధ్యత అని అన్నారు.పదవీ విరమణ ఉద్యోగానికి ముగింపు మాత్రమే, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు.వారి సేవలు యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని, పోలీసు శాఖతో వారి అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏఓ శివప్రసాద్, ఆర్ఐ సంతోష్, ఆర్ఎస్ఐ జంగయ్య, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వక్ఫ్ భూమిలో అక్రమ సామ్రాజ్యం

**- అధికారులను సైతం లెక్కచేయని భూమాఫియా**
**- రోడ్డు లేదు.. ప్లానింగ్ లేదు.. పాంప్లెట్లు చూపుతూ బురిడీ**
**- గుట్టుచప్పుడు కాకుండా ప్లాట్ల విక్రయం**







**చౌటుప్పల్, జూలై 30 (ప్రజా జ్యోతి):** చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూముల బాగోతం ఒక్కొక్కటిగా వెలుగు చూస్తోంది. వారం క్రితం ఈ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ వెంచర్ల దందాపై 'ప్రజా జ్యోతి'లో కథనం ప్రచురితమై తీవ్ర కలకలం రేపినప్పటికీ, కబ్జాదారుల తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని, రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని సర్వే నెంబర్లు 524, 525 పరిధిలోని కోట్లాది రూపాయల విలువైన వక్ఫ్ భూములను అక్రమార్కులు తమ అడుగుల్లోకి తెచ్చుకుంటున్నారు. కొందరు కేటుగాళ్లు ముఠాగా ఏర్పడి, ఎలాంటి హక్కులు లేకపోయినా ప్రభుత్వ, వక్ఫ్ స్థలాలను తమ సొంత ఆస్తిలా భావిస్తూ యథేచ్ఛగా అక్రమ దందాను సాగిస్తున్నారు. **- రోడ్డు లేదు.. ప్లానింగ్ అంతకంటే లేదు:** క్షేత్రస్థాయిలో చూస్తే అక్కడ కనీసం రాకపోకలకు సరిపడే రోడ్డు సౌకర్యం గానీ, నిబంధనల ప్రకారం ఎలాంటి అధికారిక లేఅవుట్ ప్లానింగ్ గానీ లేదు. కనీసం డ్రైనేజీ, విద్యుత్ లైన్లు వంటి ప్రాథమిక వసతులు కూడా కల్పించలేదు. అయినా సరే, రియల్ మాఫియా రంగంలోకి దిగి అమాయకులను బురిడీ కొట్టించేందుకు నకిలీ ప్లానింగ్ దయాగ్రామ్‌లను అస్త్రంగా మలుచుకుంది. కేవలం కాగితాలపై రంగుల ప్లాన్లు, నకిలీ బ్రోషర్లు చూపుతూ అమ్మకాలపర్వాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. స్థానికంగా ఉన్న అమాయక, పేద ప్రజలను లక్ష్యంగా చేసుకుని "ఫ్యూచర్ ప్రాజెక్ట్" అంటూ మాయమాటలు చెబుతూ సెటిల్మెంట్లు చేసుకుంటున్నారు. **- గజం రూ. 5,500 నుంచి 6,000కే ప్లాట్లు:** ప్రభుత్వ, వక్ఫ్ భూమి అని స్పష్టంగా తెలిసినా సరే, కొనుగోలుదారులను ఆకర్షించేందుకు తక్కువ ధరల ఎర వేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల మార్కెట్ ధరలతో పోలిస్తే చాలా చౌకగా వస్తోందని నమ్మిస్తూ, గజానికి రూ. 5,500 నుండి రూ. 6,000 వరకు బేరసారాలు కుదుర్చుకుంటూ ప్లాట్లను అంటగడుతున్నారు. అధికారుల కళ్లు గప్పి, ఎలాంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండా కేవలం తెల్లకాగితాలు, నాన్-జ్యుడీషియల్ బాండ్లపై సంతకాలు చేయిస్తూ ఇప్పటివరకు ఈ అక్రమ వెంచర్లో గుట్టుచప్పుడు పదుల సంఖ్యలో ప్లాట్ల విక్రయాలు పూర్తి చేసినట్లు స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. **- అధికారుల పర్యటన అపహాస్యం.. మాఫియా ధీమా:** వక్ఫ్ భూమిలో అక్రమ వెంచర్ వ్యవహారంపై పేపర్లలో వరుసగా వార్తలు రావడం, స్థానికంగా తీవ్ర చర్చ నడవడంతో అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో చూసి వెళ్లినా కబ్జాదారుల్లో ఏమాత్రం భయం బెదురు కనిపించడం లేదు. అధికారులు వచ్చి వెళ్లిపోయాక మళ్లీ యథాతథంగా పనులు ప్రారంభించడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. కనీసం అధికారుల హెచ్చరికలను కూడా లెక్క చేయకుండా, వారి కళ్లెదుటే ధీమాగా దందాను కొనసాగిస్తుండటం గమనార్హం. "మాకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయి.. ఎవరు వచ్చినా, ఏం చేసినా మా దందా ఆగదు" అన్న చందంగా అక్రమార్కులు ప్రవర్తిస్తూ సవాల్ విసురుతున్నారు. **- 'వక్ఫ్ భూమి' బోర్డులు పాతాల్సిందే!** రెవెన్యూ, వక్ఫ్ శాఖ అధికారులనే ఖాతరు చేయకుండా బహిరంగంగా ప్లాట్లు అమ్ముతున్నారంటే వీరి వెనుక ఎంతటి బలం ఉందో అర్థమవుతోందని స్థానిక ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, సర్వే నెంబర్లు 524, 525లలో తక్షణమే 'వక్ఫ్ భూమి - ఆక్రమణలు నిషిద్ధం' అని హెచ్చరిక బోర్డులు పాతాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారుల ఆదేశాలను కూడా తుంగలో తొక్కుతూ అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న ఆక్రమణదారులపై, వారి వెనుకున్న సూత్రధారులపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ప్రజలు కోరుతున్నారు. **- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: జ్యోతి, కొయ్యలగూడెం పంచాయతీ కార్యదర్శి** కొయ్యలగూడెం పరిధిలోని సర్వే నెంబర్లు 524, 525లలో అక్రమంగా వెంచర్ నిర్మిస్తున్న నిర్వాహకులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాము. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లు వేసినా, ప్లాట్లు విక్రయించినా బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం.




# పదో తరగతి మెమో పోగొట్టుకున్న విద్యార్థిని

**పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**వలిగొండ జూలై 30(ప్రజాజ్యోతి న్యూస్):** మండల పరిధిలోని నాతల్లగూడెం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల (సుక్క)పారిజాత తన పదో తరగతి మెమోను పోగొట్టుకుంది. నల్గొండ నుంచి నాతల్లగూడెం గ్రామానికి బైక్ పై వస్తున్న సమయంలో ఆమె వద్ద ఉన్న పదో తరగతి మెమో మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినట్లు తెలిపింది. మెమో కోసం పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పారిజాత భర్త సుక్క కిషన్ మండల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంబంధిత ధ్రువపత్రం ఎవరైనా కనుగొంటే సమీప పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## దశ దిన కర్మకు హాజరైన సంతోష్ రెడ్డి



**మోతె జూలై 30( ప్రజా జ్యోతి ):** మోతె మండలం సర్వారం గ్రామంలో ఇటీవల మరణించిన స్వర్గీయ చలమల్ల తులసమ్మదశ దిన కర్మలో పాల్గొని చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించి అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..


## నెరవేరిన సూరేపల్లి వాసుల చిరకాల స్వప్నం



**హాలియా,జూలై30(ప్రజా జ్యోతి):** సూరేపల్లి గ్రామానికి హైదరాబాద్ బస్ సర్వీస్ ను అనుముల మండల పార్టీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ యాదవ్ గురువారం జెండా ఊపి సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 6:30 గంటలకు సూరేపల్లి నుండి బయలుదేరి బస్సు హాలియా-దేవరకొండ మీదుగా సంతోష్‌నగర్ చేరుకుంటుందని,తిరిగి సాయంత్రం 5:50 గంటలకు సంతోష్‌నగర్ నుండి సూరేపల్లికి బయలు దేరుతుందని వెల్లడించారు. ఇన్నాళ్లు హైదరాబాద్ వెళ్లాలంటే హాలియా లేదా దేవరకొండ వద్ద బస్సులు మారాల్సి వచ్చేదని, ఈ ప్రత్యక్ష సర్వీసుతో విద్యార్థులు, ఉద్యోగులు,వ్యాపారులు నిత్య ప్రయాణికులకు ప్రయాణికులకు వెసులుబాటు కలిగిందని హాలియా పరిసర ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజా అవసరాలను గుర్తించి స్పందించిన ఎమ్మెల్యే జైవీర్ రెడ్డికి,ఆర్టీసీ అధికారులకు సూరేపల్లి పరిసర గ్రామాల ప్రజాప్రతినిధులు,ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లు కొండేటి సుగుణ సైదులు,బొమ్మి శెట్టి వెంకటేశ్వర్లు,జానపాటి అనూష సైదులు,మదన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,ఉప సర్పంచ్ లు జానపాటి సైదులు యాదవ్, ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్టీఐ సమాచారంలో జాప్యం
## పీఐఓకు రూ.10 వేల జరిమానా






**మల్లేపల్లి, జులై30,(ప్రజాజ్యోతి):** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ప్రకారం కోరిన సమాచారాన్నిగడువులోగా అందించడంలోవిఫలమైన ప్రజా సమాచార అధికారికి తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ రూ.10 వేల జరిమానా విధించింది. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం పోల్కంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహానికి సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారుడు కోరినా, చట్టబద్ధమైన 30 రోజుల గడువులో సమాచారం ఇవ్వకపోవడంతో పాటు మొదటి అప్పీల్‌పైనా స్పందించకపోవడంతో ద్వితీయ అప్పీల్ దాఖలైంది. అప్పీల్ నెం. 10382/రాxజ-వ్రీ/2026పై జూలై 27న రాష్ట్ర సమాచార కమిషనర్ మొహిస్సిన్ పర్వీన్ విచారణ చేపట్టారు. విచారణకు హాజరైన రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్టివిస్ట్ సొసైటీ (ఆర్టీఐఏఎస్) రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర కిషన్ నాయక్ వాదనలు వినిపించారు. ప్రజా సమాచార అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించిన కమిషన్ రూ.10 వేల జరిమానా విధిస్తూ, వారం రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది. అలాగే దరఖాస్తుదారుడు కోరిన పూర్తి సమాచారాన్ని ఆలస్యం చేయకుండా అందజేయాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా డా. కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేసే అధికారులపై కమిషన్ కఠిన చర్యలు తీసుకోవడం పారదర్శక పాలనకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

# ప్రస్తుత పరిస్థితి లో ప్రత్యామ్నాయ పంటలే మేలు

**- ఏ డి ఎ జగదీశ్వర్ రెడ్డి**

**శ్రీనివాస్ నగర్ లో సాగు క్షేత్రాల పరిశీలన**



**మిర్యాలగూడ, జూలై 30,( ప్రజాజ్యోతి ):**
ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలే మేలని మిర్యాలగూడ (ఆర్) వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగదీశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడమండలం లోని శ్రీనివాసనగర్ గ్రామంలో పెసర, బొబ్బర్లు పంటలు మరియు జీలుగ సాగు క్షేత్రాలను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రానున్న ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా ప్రాంతానికిఅనుకూలమైన అరుతడి పంటల సాగు వైపు రైతులు మళ్లాలని సూచించారు. దీంతో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని సాగు వ్యయాన్నితగ్గించడంతో పాటు రైతులు స్థిరమైన ఆదాయాన్నిపొందవచ్చని వివరించారు.అలాగే జీలుగ పంటను పరిశీలించి, దీనిని పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించడం వల్ల నేల సారవంతం పెరిగి, భూసార ఆరోగ్యం మెరుగుపడుతుందని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి ఎం. రుష్యేంద్ర మణి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

**కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి :జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోత్ రాజారామ్ పిలుపు**




**తుంగతుర్తి, జూలై 30,(ప్రజా జ్యోతి):**
ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోత్ రాజారామ్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మహాసభకు సంబంధించిన కరపత్రాలను కార్మికులకు అందజేసి మాట్లాడారు. మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కోటా రామస్వామి మాట్లాడుతూ, తుంగతుర్తి నియోజకవర్గం నుంచి కార్మికులు అధిక సంఖ్యలో మహాసభకు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మనోజ్, తడకమల్ల సైదులు, సాలయ్య, వీరబోయిన కృష్ణ, కసర్బోయిన బిక్షం, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్టుల రక్షణ రైతుల బాధ్యత దొంగతనాలకు చెక్ పెట్టేందుకు సమష్టిగా కృషి చేయాలి

**-రైతు కమిటీలతో నిరంతర పర్యవేక్షణ- లిఫ్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**

**-లిఫ్టులను సొంత ఆస్తిగా కాపాడుకోవాలి- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**





**హుజూర్‌నగర్, జూలై 30 (ప్రజాజ్యోతి):**
వ్యవసాయానికి ప్రాణాధారమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల రక్షణ, నిర్వహణతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, ఆయిల్ దొంగతనాల నివారణకు రైతులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో గురువారం రైతులు, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**రైతు కమిటీలతో పర్యవేక్షణ: కలెక్టర్:**ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలలో దొంగతనాలు జరిగితే చివరకు నష్టపోయేది రైతులేనని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. దొంగతనాలు జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడం కంటే ముందస్తుగా వాటిని అరికట్టడమే ముఖ్యమన్నారు. ప్రతి లిఫ్ట్ పరిధిలో రైతులు కమిటీలు ఏర్పాటు చేసుకుని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. లిఫ్టుల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతు కమిటీల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో నీటి పొదుపుతో పాటు తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు.

**పెట్రోలింగ్ ముమ్మరం: ఎస్పీ నరసింహ:**రైతులకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ నరసింహ తెలిపారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న లిఫ్ట్ పథకాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఆయిల్ తదితర సామగ్రిని అపహరిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల మధ్య ఐకమత్యం, సామాజిక బాధ్యత పెరిగితే దొంగతనాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. లిఫ్టుల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి పోలీసుల పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై రైతులు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**లిఫ్టులను సొంత ఆస్తిగా కాపాడుకోవాలి: ఎమ్మెల్యే:**రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను రైతులు తమ సొంత ఆస్తిగా భావించి రక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. లిఫ్టులలో దొంగతనాలు జరిగితే సాగునీరు అందక రైతులే నష్టపోతారని తెలిపారు. రైతులకు నిరంతర సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. దొంగతనాల నివారణకు వివిధ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అవగాహన సదస్సు నిర్వహించిన పోలీసు శాఖను, ఎస్పీ నరసింహను ఎమ్మెల్యే అభినందించారు.కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సూర్యనారాయణ, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, విద్యుత్ డీఈ రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ కవితతో పాటు ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పార్టీ, నామినేటెడ్ పదవుల్లో మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలంటూ

**-మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీను ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కు వినతి**

**మిర్యాలగూడ, జులై 30,( ప్రజాజ్యోతి ):**
మిర్యాలగూడ నియోజకవర్గంలో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలకు రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవుల్లో, పార్టీ కమిటీల్లో తగిన ప్రాధాన్యతకల్పించాలని కోరుతూ గురువారం మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణం లోని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత, స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్ లను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ నిర్మాణం నుంచి అభివృద్ధి కార్యక్రమాల వరకు మాదిగ సామాజిక వర్గం ఎల్లప్పుడూ ముందుంటోందని,వారికి పదవుల్లోనూ,పార్టీ కమిటీలలోనూ సముచిత స్థానం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.?ఈ సందర్భంగా వినతి పత్రాన్ని స్వీకరించిన ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్,డిసిసి అధ్యక్షుడు పున్నా కైలాష్ లు స్పందిస్తూ ఈ అంశాన్ని పిసిసి అధ్యక్షుడు,అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని



తెలిపారు.నియోజకవర్గంలోని మాదిగ నాయకులు,కార్యకర్తలకు రాబోయే రోజుల్లో పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా మంచి అవకాశాలు కల్పిస్తా మని వారు ఆ హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో ఎస్సీ మాదిగ వర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు సాగుచేస్తే రైతులకు మేలు విజ్ఞప్తి

## -నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నిడమనూరు, జూలై 30(ప్రజాజ్యోతి):**
ఎల్ నినో కారణంగా నల్లగొండ జిల్లాలో 40% తక్కువ వర్షపాతం నమోదైన దృష్ట్యా రైతులు ఈ వ్యవసాయ సీజన్ లో కంది, పెసర, సజ్జలు, జొన్నలు వంటి ఆరుతడి పంటలు సాగుచేస్తే రైతులకు మేలు అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుతడి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందన్నారు.దీంతో రైతులకు మేలు కలుగుతుందని,మంచి ఆదాయం వస్తోందని చెప్పారు. అందువల్ల జిల్లాలోని రైతులందరూ ఈ వ్యవసాయ సీజన్లలో అరుతడి పంటలు, కూరగాయల పంటల సాగుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.గురువారం నిడమనూరు మండలంలోని బంకాపురం గ్రామంలో కంది పంట సాగు చేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు.ఈ సందర్భంగా కంది పంట సాగు వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో కంది సాగు చేశారని పంట వయస్సు ఎంత అని నల్లరేగడి భూమిలో పంట పరిస్థితి ఎలా ఉందని ప్రశ్నించారు. దీనికి రైతులు సమాధానమిస్తూ రెండు నెలల క్రితం 15 ఎకరాల్లో కంది సాగు చేశామని తెలిపారు.అదేవిధంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు ఎల్‌నినో ప్రభావం కారణంగా జిల్లాలో సాధారణం వర్షపాతం కంటే 40 శాతం తక్కువగా నమోదైంది.ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజ్ మాత్రమే ఉన్నందున నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు తప్పనిసరిగా ఆరుతడి పంటల వైపు మళ్లాలని విజ్ఞప్తి చేశారు.ఆరుతడి పంటలు 90 రోజుల వ్యవధిలో చేతికి వస్తాయని,తక్కువ నీటితో మంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు.ఒకవేళ భవిష్యత్తులో నీటి లభ్యత మెరుగుపడితే పరిస్థితులకు అనుగుణంగా ఇతర పంటల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం వివిధ రకాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ఇస్తున్నది.మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కంది,పెసర వంటి పంటలను ఎక్కువగా సాగు చేస్తే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని అన్నారు. అలాగే పండ్ల తోటలు, కూరగాయల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని కోరారు.పంటల్లో కలుపు మొక్కలు పెరిగిన వెంటనే శాస్త్రీయ పద్ధతుల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, వ్యవసాయ అధికారులు అవసరైతే రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి కలుపు నివారణ, పంటల నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడిన సందర్భంగా యాప్ వినియోగంపై ఎలాంటి ఇబ్బందులు లేవని రైతులు కలెక్టర్‌కు తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఆరుతడి పంటలు సాగు చేస్తామని చెప్పారు.ఆరుతడి పంటలకు సంబంధించి జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజూ సమీక్షించి నివేదిక సమర్పించాలని, రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి టి .శేఖర్,ఏడిఏ సరిత,మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, ఏవో మున్నికృష్ణ, తహసిల్దార్ కృష్ణయ్య,ఏఈలు నిషిత, క్రాంతి కుమార్, సర్పంచ్ చిన్న వెంకటేశ్వర్లు , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ విజయకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ లు ఉన్నం శోభ సత్యనారాయణ,పిసిసి డెలికేట్ మెంబర్ ముంగిశివమారయ్య,వ్యవసాయ అధికారులు, రైతులు , తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

## హుజూర్‌నగర్ పోలీసుల చాకచక్యం




**హుజూర్ నగర్, జూలై 30 (ప్రజాజ్యోతి):** గంజాయి అక్రమ రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడు బీరెల్లి ప్రదీప్‌రెడ్డి అలియాస్ సన్నీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు గురువారం తెలిపిన వివరాల ప్రకారంజూన్ 9న హుజూర్‌నగర్ శివారులోని పరకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో కొప్పుల శ్రీకాంత్ అలియాస్ పండు, కాసాని సాయికృష్ణ, దూరు సందీప్, దేరంగుల వాసు, గంగాధరి అభిరామ్ అలియాస్ అభి, సాతి అరవింద్‌సింగ్ ఉన్నారు.ఇదే కేసులో ఏడో నిందితుడిగా ఉన్న హుజూర్‌నగర్ ఎన్జీవోస్ కాలనీకి చెందిన బీరెల్లి ప్రదీప్‌రెడ్డి కేసు విషయం తెలుసుకుని అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు.సీఐ జి.చరమందరాజు ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుడి అరెస్టులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై హనుమాన్‌నాయక్, సిబ్బంది సిహెచ్.నరేష్, బి.వెంకటేష్‌లను సీఐ అభినందించారు.

# నడిగూడెంలో వాహనాల విస్తృత తనిఖీలు



**నడిగూడెం, జూలై 30: ప్రజా జ్యోతిః**
రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల భద్రతే లక్ష్యంగా నడిగూడెం పోలీసులు గురువారం మండల కేంద్రంలో విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ తేజస్విని ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం తదితర పత్రాలను పరిశీలించారు.అదేవిధంగా మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగించాలని ఎస్ఐ తేజస్విని సూచించారు.

# ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలి

## - అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశం

## - చౌటుప్పల్ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన





**చౌటుప్పల్, జులై 30 ( ప్రజా జ్యోతి ):** చౌటుప్పల్‌లో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పురోగతిపై కాంట్రాక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నార్కట్పల్లి పోలీసులకు, ప్రజాప్రతినిధులకు సంబంధం లేదు.. కావాలనే బద్నాం చేస్తున్నారు

## జాల నరసింహ, జాల ముకుంద

నార్కెట్‌పల్లి, జూలై 30: నార్కెట్‌పల్లి మండలంలోని షాపెల్లి గ్రామంలో జరిగిన భూ వివాదానికి అధికారులు, ప్రజాప్రతినిధులు లేదా స్థానిక నాయకులకు ఎలాంటి సంబంధం లేదని, వారిపై తమ ప్రత్యర్థులు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని జాల నరసింహ, జాల ముకుంద ఒక ప్రకటనలో తెలిపారు.వారి వివరాల ప్రకారం.. తాము అన్నదమ్ములమని, సర్వే నంబర్ 254లో తమకు కొంత భూమి ఉందన్నారు. అదే సర్వే నంబర్‌లో సైదిరెడ్డికి కూడా భూమి ఉండగా, ఆయన నుంచి తమకు 10 గుంటల భూమి రావాల్సి ఉందని తెలిపారు. ఈ విషయంపై గత కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోందని పేర్కొన్నారు.ఈ నెల 25వ తేదీన తమకు రావాల్సిన 10 గుంటల భూమి ఇవ్వాలని సైదిరెడ్డిని అడగగా, ఆయన తమ కులాన్ని దూషిస్తూ దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనపై నార్కెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.అనంతరం పోలీసులు పొలం వద్దకు వచ్చి విచారణ చేపడుతున్న సమయంలో కూడా సైదిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు పోలీసుల సమక్షంలోనే తమపై మరోసారి దాడి చేశారని చెప్పారు. ఈ ఘటనలో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారని పేర్కొన్నారు.ఈ ఘటనలో తమ నలుగురిపై కేసులు నమోదు చేయగా, ప్రత్యర్థి వర్గానికి చెందిన ఇద్దరిపై మాత్రమే కేసులు నమోదు చేశారని తెలిపారు. తమ భూ వివాదంలో నార్కట్పల్లి పోలీసులకు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ వారిని కావాలనే బద్నాం చేసేలా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వాస్తవాలను గుర్తించాలని జాల నరసింహ, జాల ముకుంద విజ్ఞప్తి చేశారు.